‘కంటివెలుగు’పై ప్రత్యేక శ్రద్ధ


తాడూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి


వెల్దండలో కంటివైద్య శిబిరంలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

తాడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు విజయవంతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి సంతోష్ అభిరాం, ఎంపీడీఓ గంగమోహన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గురువారం నుంచి మండల కేంద్రంతో పాటు గుంతకోడూరులో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కల్వకుర్తిరూరల్: కంటి వెలుగు విజయవంతం చేద్దామని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో రఘుపతిపేట, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ

వెల్దండ: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంటివైద్య శిబిరాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. వచ్చే ప్రజలకు అన్ని వసతులను ఉంచాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. వెల్దండ రైతువేదిక, బొల్లంపల్లి రైతువేదికల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని ప్రతి కేంద్రంలో 250 మందికి కంటి పరీక్షలు చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ఉప్పునుంతల: మండలంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో వారు సమీక్ష నిర్వహించారు. ఉప్పునుంతల, ఉప్పరిపల్లిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించి విజయవంతం చేయాలన్నారు.

కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

తెలకపల్లి: మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్రాన్ని సందర్శించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఎంపీపీ మధు, ఎంపీటీసీ రమేష్, అధికారులు సందర్శించారు.

చారకొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేసిన సౌకర్యాలను బుధవారం పరిశీలించారు.

అమ్రాబాద్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం పదర రైతు వేదిక, వంకేశ్వరంలో రెండు గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని కంటి సమస్యలను గుర్తించిఅవసరమైన కంటి అద్దాలు ఇస్తారన్నారు. కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్ చేస్తారని తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు


కల్వకుర్తిలో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు చెబుతూ లేఖ పంపించారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ చౌరస్తా నుండి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శాలువాలు, గజమాలతో సత్కరించారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ట పార్టీ కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్‌కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. భూపతిరెడ్డి, సర్పంచ్ రేవతి, సింగల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, శేఖర్, నాయకులు బచ్చు రామకృష్ణ, రాజశేఖర్, గోపాల్‌నాయక్, అలీ, జంగయ్య, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం



కొల్లాపూర్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీఎన్జీఓ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. కొత్తగా ఎన్నికైన కమిటీ నాయకులకు ఎమ్మెల్యే అభినందలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషిచేయాలని ఆయన నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు సత్యనారాయణయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, ప్రేమ్‌చంద్, సత్యనారాయణ, రాజుయాదవ్, నర్మద, గణేష్ పాల్గొన్నారు.

సభా ఏర్పాట్ల పరిశీలన


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: దళిత గిరిజన ఆత్మగౌరవ బహిరంగ సభ ఏర్పాట్ల పనులను మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని వనపర్తి మార్గంలో రైతువేదిక సమీపంలో ఈ సభను 22వ తేదీన నిర్వహించనున్నారు. సభాస్థలిని, వీవీపీ కేంద్రాలను, ప్రెస్ గ్యాలరీ వంటి పలు విభాగాల ఏర్పాటును నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట రవి, రాము, పాండు, రాములు, అహ్మద్, ఈశ్వర్, వేణు, సత్యం, భీముడు తదితరులు ఉన్నారు.

22 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

కందనూలు: జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, కోశాధికారి శివశంకర్ తెలిపారు. బుధవారం ఆలయంలో బ్రహ్మోత్సవాల కరదీపికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన, కుంకుమార్చన, అమ్మవారికి అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో భాగంగా 22న ఆదివారం ఉదయం 11 గంటలకు గణపతి హోమం, 23న సోమవారం ఉదయం 7 గంటల నుంచి సామూహిక అభిషేకాలు, 10 గంటలకు నవగ్రహ హోమం, 24న మంగళవారం గాయత్రి హోమం, 25న గురువారం గురు దత్తాత్రేయ హోమం, చండీ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి జన్మదినోత్సవం 26న గురువారం మహా సరస్వతీ హోమం, జన్మదిన కార్యక్రమాలు, ప్రత్యేక అక్షరాభ్యాసాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి నక్షత్ర, కుంభ, కర్పూర హారతి, భక్తులకు వేద బ్రాహ్మణులచే వేద ఆశీర్వచనం అమ్మవారికి ప్రత్యేక ప్రసాద నైవేద్య నివేదన, అనంతరం తీర్థ ప్రసాద పంపిణీ గోష్టి ఉందన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, హకీం రాజేష్, భూపాల్ రెడ్డి, నవీన్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

దారిని అడ్డుకుంటే సహించేది లేదు


అల్లాపూర్‌లో భూములను పరిశీలిస్తున్న మాలమహానాడు నాయకులు

తాడూరు: దళితులు వారి వ్యవసాయ భూములకు వెళ్లే దారులను అడ్డుకుంటే సహించేది లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అన్నారు. బుధవారం మండలంలోని అల్లాపూర్‌ను సందర్శించారు. గ్రామంలో 500 ఎకరాల వ్యవసాయ భూములలోకి బీసీలు కావాలని కుట్రపన్ని దళితుల భూముల్లోకి వెళ్లే దారిని ఇవ్వకుండా అడ్డగించారన్నారు. తరతరాల నుంచి దళితుల వ్యవసాయ భూములలోకి బీసీలు కొందరి ప్రోద్బలంతోనే కావాలని దారి వెంట వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. దారి ఇవ్వకుంటే చలో నాగర్‌కర్నూల్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, శ్రీనివాస్, చంటి, సూరి, తిరుపతయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అసభ్యంగా దూషిస్తే సహించం


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ

అచ్చంపేట రూరల్: మహిళలను కించపర్చే విధంగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణపై ప్రతిఘటిస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, బల్మూర్ ఎంపీపీ అరుణ, అమ్రాబాద్ సర్పంచ్ శారద హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గువ్వల అమల నల్లమల ప్రాంతంలోని చెంచుపెంటలలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆయన సతీమణి గువ్వల అమలను విమర్శించడం తగదన్నారు. వంశీకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మహిళలకు ఎంత గౌరవం ఇచ్చారో అందరికి తెలుసన్నారు. వంశీకృష్ణ భార్య అనురాధను బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ కూడా విమర్శించడం లేదని, ఆయన మాత్రం పనిగట్టుకుని గువ్వల అమలను విమర్శిస్తున్నారన్నారు. మహిళలను అగౌరవ పరిస్తే ఎప్పటికీ శాశ్వత మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోతారని అన్నారు. మహిళలను గౌరవించకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాజాబీ, లక్ష్మి, గౌరమ్మ, నిరంజనమ్మ, అంజనమ్మ, భాగ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగిస్తాం


కల్వకుర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని పార్టీ నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం బుధవారం కొల్లాపూర్, ఉప్పునుంతల, పెంట్లవెల్లి, కల్వకుర్తి మండలంలో నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. బలహీనవర్గాల అభ్యున్నతికోసం ఆయన తుదిశ్వాస విడిచే వరకు కృషి చేశారని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

బిజినేపల్లి: మండల కేంద్రంలోని పోలేపల్లి వెళ్లే కేఎల్ఐ కాల్వ సమీపంలో వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం తాడిపత్రి చెందిన చందు(25) చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందు తాడిపత్రి గ్రామం నుంచి బిజినేపల్లి మండలంలోని మహాదేవునిపేటలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని పేర్కొంటు తాను ఆత్మహత్య చేసుకునే లోకేషన్‌ను సోషల్‌మీడియాలో షేర్ చేశాడు. తర్వాత ఒక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని స్నేహితులు షేర్ చేసిన లోకేషన్ కుటుంబ సభ్యులకు చెప్పడంతో ప్రాంతాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. మృతుడికి తల్లి శాంతమ్మ తండ్రి రాములు ముగ్గురు సోదరలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నాగర్‌కర్నూల్‌క్రైం: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు గతనెల 31న అనారోగ్యం బారిన పడిన వ్యక్తి చికిత్సకోసం ఆస్పత్రిలో చేరాడు. 18రోజులుగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నించిన లభించకపోవడంతో మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే పోలిస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో విద్యుదాఘాతంతో నక్క బాలచంద్రయ్య (65) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలచంద్రయ్య తన ఇంటి దగ్గర నల్ల గుంతకు కరెంట్ మోటర్ పెట్టాడు. కరెంట్ సరఫరా అవుతున్న బోర్డుకు ఉన్న ప్లగ్ తీయకుండా కింద మోటర్‌కు ఉన్న ప్లగ్ తీయడంతో షాక్ తగిలింది. అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు సివిల్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స చేస్తుండగానే చనిపోయాడు. మృతునికి ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

అమ్రాబాద్: మండలంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన తిరుపతి, లక్ష్మాపూర్(బీకే) చెందిన రాములమ్మ వద్ద పదిలీటర్ల సారా, 320 లీటర్ల బెల్లం ఊట లభించిందని, సారా స్వాధీనం చేసుకుని బెల్లం ఊటను అక్కడనే ధ్వంసం చేసినట్లు తెలిపారు.

జాతరలో కిక్కిరిసిన జనం


గుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


క్యూలైన్‌లో నిలిచిన భక్తులు

- గుండంలో స్నానాల ఆచరణ
- ఏర్పాటైన తినుబండారాలు, ఆటవస్తువుల దుకాణాలు
- రథోత్సవానికి వేషధారణలో వచ్చిన చెంచులు


రథం ముందు నృత్యం చేస్తున్న చెంచులు


రంగుల రాట్నం వద్ద చిన్నారుల కోలాహలం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవాలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు సమీపంలో ఉన్న గుండంలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. తలనీలాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. చెంచులు రథోత్సవం ముందు వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తినుబండరాల దుకాణాలు కిటకిటలాడాయి. రంగుల రాట్నం వద్ద చిన్నారుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు కొంత అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి వారి దేవాలయానికి ఎదురుగా ఉన్న రత్నగిరి కొండపై వెలసిన లక్ష్మీదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు కొల్లాపూర్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆవరణలో ఏర్పాటు చేసిన అన్ని రకాల దుకాణాలు జనంతో నిండిపోయాయి.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శాలీశ్వర్, నవీన్, శేఖర్, మల్లేష్, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దెతండాకు చెందిన రజిత కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ఐక్యతా చైర్మన్ రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఆయన రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తారాసింగ్, రవీందర్, వెంకటయ్య, హనుమంతు, శ్రీపతిరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: వెన్నచర్లలో అర్హులైన దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను ఆర్టీసీ సిబ్బంది సుదర్శన్‌రావు బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన వారంతా దరకాస్తు చేసుకుంటే పాస్‌లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, ఉపసర్పంచ్ భాస్కర్ రెడ్డి, లక్ష్మీ, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ

కోడేరు: మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ వద్ద సర్పంచ్ వెంకటస్వామి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలపై మాట్లాడి తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం ప్రతి మంగళవారం నిర్వహించే సంత కోసం వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీఓ ప్రభాకర్, కార్యదర్శి రవితేజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



పెంట్లవెల్లి: ప్రజా సమస్యలపై పోరాడుతామని జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సాంబశివుడు అన్నారు. మండలంలో బుధవారం పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండలంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని అనంతరం కార్యకర్తలకు పార్టీ బలోపేతం పట్ల దిశానిర్దేశం చేశారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పార్టీ పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాజు, రవితేజ, అనిల్, ఆంజనేయులు, గిరిప్రసాద్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కొల్లాపూర్: మండలంలోని ఎన్మన్‌బెట్ల చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, పరశురామ్‌నాయుడు, తిరుపతయ్య, శివ, రాముడు, కార్తీక్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వెల్దండ: మండలంలోని రావిచెట్టుబావితండాకు చెందిన లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కుటుంబాన్ని పరామర్శించి ఓదర్చారు. అనంతరం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట విజేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలస్వామి, జంగయ్యయాదవ్, చిందం కృష్ణయ్య, దాసు, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు, స్థానిక నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎంతో ఘనంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.